

# తెలివి కతలు

ఒకడు చాలా పెద్ద తెలివిగలవాడినని అనుకునేవాడు. అంతటితో ఊరుకుంటే బాగుణ్ను. కాని నా భార్య కూడా నా అంత తెలివైనదిగా ఉండాలి లేకుంటే వద్దు అని ఎవరు పెళ్లి చేసుకుంటామని వచ్చినా ఒక షరతు పెట్టేవాడు.

అదేమిటిరా అంటే వండటానికి బియ్యం, పప్పు, ఉప్పు అన్నీ యిచ్చేవాడుగానీ పొయ్యిలోకి కట్టెలకు బదులు చెరుకుగడలు యిచ్చేవాడు. చెరుకు గడలను మండించి వంట చేసిన వారినే పెళ్లి చేసుకుంటా అనేవాడు.

ఈ పోటీకి ఎంత మంది వచ్చినా చెరుకుగడలను ఎలా మండించాలో తెలియక ఓడిపోయేవాళ్లు.

సరిగ్గా అప్పుడే ఒకామె వచ్చింది. 'నువ్వు చెప్పినట్టుగా నేను వండుతాను. కానీ నేను చెప్పినట్టుగా నువ్వు తినాలి. సరేనా' అంది.

'సరే' అన్నాడు తెలివిమీరినవాడు.

అప్పుడామె ఆ దగ్గరలోనే ఆడుకుంటున్న చిన్నపిల్లలను పిలిచి 'ఒరే. ఈ చెరుకు గడలని కసాబిసా నమిలి యిక్కడ ఊయండిరా' అంది. పిల్లలు దొరికిందే సందని సపసపమని గడల్ని నమిలి పిప్పి ఊశారు. దాన్ని ఆమె కాసేపు ఎండబెట్టి నిప్పు రాజేసింది. ఆ మంటలోనే వంట వండ పెట్టింది. అది చూసి నోరెళ్లబెట్టాడు తెలివిమీరినవాడు.

'నువ్వు చెప్పినట్టుగా నేను వండాను. యిప్పుడు నేను చెప్పినట్టుగా నువ్వు తినాలి. ఎలగరా అంటే నువ్వు తినేటప్పుడు నీ దవడ ఆడకూడదు. ఆడిందా ఖబర్‌దార్' అందామె.

దవడ కదిలించకుండా ఎవరు తినగలరు? ఏం తినాలన్నా తాగాలన్నా దవడ ఆడించాలి గదా. అమ్మా బీబీ క్షమించు అని కాళ్ల మీద పడ్డాడు తెలివిమీరిన వాడు.

అది ఒక కత.

ఇంకో కతలో యింకొకడు కూడా యిలాగే 'నేను తెలివైన వాణ్ణి. తెలివైన వాణ్ణి' అని తిరుగుతా ఉండేవాడు.

వాడు పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. పెళ్లి కూడా యించుమించుగా ఖాయమైపోయింది. అయితే యింతలో వాడు 'పెళ్లికూతురు నా అంత తెలివైనదేనా?' అని మాట జారాడు. ఈ సంగతి పెళ్లికూతురికి తెలిసిపోయింది. ఆయన అంతమాట అన్నాక నా తెలివి కూడా చూపించక తప్పదు అనుకొని, వాణ్ణి పిలిచి 'ఒరే. అడవికి వెళ్లి కోస్తే రక్తం రాని మాంసం తీసుకురారా. అప్పుడే నిన్ను పెళ్లి చేసుకుంటా' అంది.

కోస్తే రక్తం రాని మాంసం ఏంది? కుందేల్ని కోసినా, పొట్టేల్ని కోసినా, జింకని కోసినా, ఆఖరికి కోడిని కోసినా రక్తం వస్తుందే. రక్తం రాని మాంసం ఏందబ్బా అని వాడు తలకాయ బద్దలు కొట్టుకున్నాడు. ఆఖరుకు చేతులెత్తేసి 'అదేమిటో చెప్పు బీబీ' అని కాళ్ల మీద పడ్డాడు.

'ఆ మాత్రం తెలియదా. పుట్టగొడుగులు' అని జవాబు చెప్పింది పెళ్లికూతురు.

'పుట్టగొడుగులది మాంసం రుచి. కానీ వాటిని కోస్తే రక్తం రాదుగా' అని వివరించింది.

'ఈ మాత్రం తెలియనివాడిని పెద్ద పుండింగిలాగా నన్ను చేసుకోవడానికి బయల్దేరావు. వెళ్లు వెళ్లు' అని వాడిని చేసుకోకుండానే పంపించేసింది.